



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM

## రూ.25 లక్షలకు వరకు
# ఆరోగ్యశ్రీ వర్తింపు



పేదలకు ఉచితంగా చికిత్స అందించేందుకు ఉద్దేశించిన ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. ఆరోగ్యశ్రీ పథకంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సీఎం ఈ మేరకు వెల్లడించారు. అర్హులందరికీ ఈ పెంపు వర్తించనుందని తెలిపారు. కాగా, ఈ నెల 19 నుంచి నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు.

## తెలంగాణ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్
# ఏకగ్రీవ ఎన్నిక



నాలుగు రోజుల విరామం అనంతరం తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, భారాస ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు ప్రసాద్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఆయన్ను స్పీకర్ స్థానం వద్దకు సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర నేతలు తోడ్కొని వెళ్లి కూర్చోబెట్టారు. స్పీకర్ పదవికి ప్రసాద్‌కుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడం, ప్రధాన ప్రతిపక్షం భారాసతో పాటు మజ్లిస్, సీపీఐ ఎమ్మెల్యేలు మద్దతు తెలపడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అంతకుముందు పలువురు ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. కాంగ్రెస్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రమాణం చేశారు. ఆ తర్వాత భారాస నుంచి కేటీఆర్, పద్మారావు, పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. సభ్యుల ప్రమాణ స్వీకారాలు పూర్తయిన అనంతరం స్పీకర్ ఎన్నికను ప్రొటెం స్పీకర్ అధికారికంగా ప్రకటించారు.



సచివాలయంలో ఆర్థిక, ప్రణాళిక మరియు విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

శ్రీధర్ బాబు తెలంగాణ IT, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల మంత్రిగా డాక్టర్ B.R.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు.





## సిక్కింలో భారీ హిమపాతం.. 800 మంది
# టూరిస్ట్‌లను రక్షించిన ఆర్మీ

శీతాకాలం కారణంగా ప్రస్తుతం దేశంలో చలి తీవ్రత పెరిగింది. ఇక మంచు అధికంగా కురిసే రాష్ట్రాల్లో అయితే ఉష్ణోగ్రతలకు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ఈశాన్య రాష్ట్రం సిక్కిం గత మూడు రోజులుగా భారీ మంచు తో వణికిపోతోంది. మంచు కారణంగా ఎత్తైన ప్రాంతాల్లో సుమారు 800 మందికిపైగా పర్యాటకులు చిక్కుకుపోయారు. హిమపాతం, ప్రతికూల వాతావరణం కారణంగా తూర్పు సిక్కింలోని వివిధ ప్రాంతాల్లో వృద్ధులు, మహిళలు, పిల్లలతో సహా సుమారు 800 మందికిపైగా పర్యాటకులు చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. వారందరినీ భారత ఆర్మీ రక్షించింది. వారందరినీ ప్రత్యేక వాహనాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించింది. మరోవైపు ప్రస్తుతం రాష్ట్రంలో హిమపాతం అధికంగా ఉండటంతో సిక్కిం వచ్చే పర్యాటకులను అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.



## మంత్రి సీతక్క ఛాంబర్‌లో
# స్మితా సబర్వాల్

తెలంగాణ పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కను ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ కలిశారు. ఇవాళ ఉదయం సీతక్క సెక్రటేరియట్ లోని తన ఛాంబర్ లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్మితసబర్వాల్ సెక్రటేరియట్ కు వెళ్లి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కేసీఆర్ హయాంలో కీలకంగా వ్యవహరించిన స్మిత సబర్వాల్.. తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా కాళేశ్వరం పనులతోపాటు మిషన్ భగీరథ పనులను పర్యవేక్షించారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక ఇప్పటి వరకు ఆమె ఇంత వరకు ఎవర్నీ కలవలేదు. అవన్నీ అవాస్తవమని తాను ఎక్కడికి వెళ్లడం లేదని ట్విట్టర్లో వెల్లడించారు. తాను రాష్ట్రంలోనే పనిచేస్తానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తనకు ఏ బాధ్యత అప్పజెప్పినా నిర్వహిస్తానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలో భాగమైనందుకు తాను గర్విస్తున్నట్లు చెప్పారు.



## భూకబ్జా ఆరోపణలపై స్పందించిన
# మాజీ మంత్రి మల్లారెడ్డి

భూకబ్జాలు చేయాల్సిన అవసరం తనకు లేదని భారాస నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. సికింద్రాబాద్ సమీపంలోని మూడు చింతలపల్లి కేశవరం భూకబ్జా ఆరోపణల విషయంలో తనపై కేసు నమోదు కావడంపై ఆయన స్పందించారు. భూకబ్జా చేసినట్లు తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. గిరిజనుల 47 ఎకరాలకు సంబంధించిన భూమి విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. కొంతమంది మధ్యవర్తులు కొనుగోలు, అమ్మకాల్లో ఉన్నారని.. గిరిజనుల భూమిని వారే కబ్జా చేసి ఉంటారని ఆరోపించారు. ఈ ఘటనలో ప్రభుత్వ కక్ష సాధింపు చర్య ఉన్నట్లు భావించడం లేదన్నారు.



## ఓయూలో ఉద్రిక్తత.. విద్యార్థుల అరెస్ట్

హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. పరిపాలన భవనం దగ్గర విద్యార్థులు ఆందోళనకు దిగారు. పరిపాలన భవనం వద్ద ముళ్ల కంచెలు తొలగించాలని, ఇకనైనా ఓయూ వీసి నిరంకుశత్వం నశించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అక్కడ పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో పోలీసులు విద్యార్థులను అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు.

## 70 వేల మార్క్ దాటిన
# సెన్సెక్స్



అంతర్జాతీయంగా సానుకూల సంకేతాల కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ట్రేడింగ్‌ను మొదలుపెట్టాయి. ఉదయం 9.22 సమయంలో సెన్సెక్స్ 665 పాయింట్ల లాభంతో 70,249 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు ఎగసి 21,112 వద్ద ట్రేడవుతున్నాయి. పీటీసీ ఇండస్ట్రీస్, పైసాలో డిజిటల్, టాన్లా ప్లాట్‌ఫామ్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ, ఎన్‌బీసీసీ (ఇండియా) షేర్లు భారీ లాభాల్లో ఉండగా.. ఛంబల్ ఫర్టిలైజర్స్, హిండ్ జింక్, మిస్ బెక్టార్స్ ఫుడ్, అరవింద్ లిమిటెడ్, ధాని సర్వీసెస్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయ మారకం విలువ 83.38 వద్ద కొనసాగుతోంది. అమెరికా ఫెడ్ నిర్ణయం అంతర్జాతీయ మార్కెట్ సూచీలపై సానుకూల ప్రభావం చూపింది. ఆసియా-పసిఫిక్‌లో ఒక్క జపాన్ సూచీ మినహా మిగిలిన ప్రధాన సూచీలు మొత్తం లాభాల్లోనే ట్రేడవుతున్నాయి.

### ఫెడ్ రేట్లు యథాతథం..

యూఎస్ ఫెడరల్ రిజర్వ్ తన కీలక రేట్లలో మార్పు చేయలేదు. రెండు రోజుల పాటు జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎమ్‌సీ) సమావేశ నిర్ణయాన్ని భారత కాలమాన ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి దాటాక వెలువరించింది. ద్రవ్యోల్బణం ఇంకా 2 శాతం లక్ష్యం కంటే ఎగువనే ఉన్నందున, కఠిన వైఖరిని కొనసాగిస్తూ.. విధాన రేట్లను ప్రస్తుత 5.25-5.50 శాతం శ్రేణిలోనే ఉంచుతున్నట్లు పేర్కొంది. వరుసగా మూడో సారీ రేట్లను ఇదే స్థాయిలో కొనసాగించింది. ఇవి 22 ఏళ్ల గరిష్ఠ స్థాయి రేట్లు 2024లో 2 సార్లు రేట్ల కోతకు అవకాశం ఉండొచ్చనే సంకేతాలిచ్చింది.




## ఐపీఎల్ @రూ.83 వేల కోట్లు

ఇంతింతై అన్నట్లు ఎదుగుతున్న ఐపీఎల్ మరో ఘనత సొంతం చేసుకుంది. 10 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువను దాటి డెకాకార్న్ హోదాను దక్కించుకుంది. ప్రస్తుతం ఐపీఎల్ బ్రాండ్ విలువ 10.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.83,353 కోట్లు)గా ఉంది. 2022 (8.4 బిలియన్ డాలర్లు)తో పోలిస్తే ఆ విలువ 28 శాతం పెరిగింది. ఇక ఐపీఎల్ ఆరంభమైన 2008తో పోలిస్తే ఏకంగా 433 శాతం వృద్ధి ఉంది. బ్రాండ్ విలువను లెక్కగట్టే సంస్థ బ్రాండ్ ఫినాన్స్ రివీల్స్ ఈ నివేదికను వెల్లడించింది. మీడియా హక్కుల కింద 6.2 బిలియన్ డాలర్లు (రూ.48,390 కోట్లు) రావడం, రెండు ఫ్రాంఛైజీలు కొత్తగా చేరడం, కొవిడ్ తర్వాత స్టేడియాలు పూర్తిగా నిండటం తదితర కారణాలతో బ్రాండ్ విలువ పెరిగిందని నివేదిక పేర్కొంది. ఇక ఫ్రాంఛైజీల విషయానికి వస్తే ముంబయి ఇండియన్స్ 87 మిలియన్ డాలర్లు (సుమారు రూ.725 కోట్లు), చెన్నై సూపర్ కింగ్స్ 81 మిలియన్ డాలర్లు (రూ.675 కోట్లు), కోల్‌కతా నైట్‌రైడర్స్ 78.6 మిలియన్ డాలర్లు (రూ.655 కోట్లు), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 69.8 మిలియన్ డాలర్లు (రూ.581 కోట్లు) వరుసగా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి.

## అసెంబ్లీలో 8 మంది ఎమ్మెల్యేల ప్రమాణం.. ఇంకా చేయని వాళ్లు వీరే..


అసెంబ్లీలో ఇటీవల గెలిచిన 8 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ నుంచి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి.. బీఆర్ ఎస్ నుంచి కేటీఆర్, కడియం శ్రీహరి,కొత్త ప్రభాకర్ రెడ్డి, పద్మారావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డితో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. డిసెంబర్ 10న 101 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. దీంతోఇప్పటి వరకు 109 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. ఇంకా మాజీ సీఎం కేసీఆర్ తో పాటు మిర్యాల గూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బీజేపీ నుంచి గెలిచిన 8 మంది ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం అనంతరం స్పీకర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్ ను అధికారికంగా ప్రకటించారు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ. స్పీకర్ కు సీఎంతో పాటు అధికార, విపక్ష ఎమ్మెల్యేలు అభినందనలు తెలిపారు.






# షామా సికందర్ గ్లామరస్ లుక్

మోనోకినిలో షామా సికందర్ గ్లామరస్ లుక్ వైరల్ అవుతోంది, పిక్స్ చూడండి.. టీవీ మరియు బాలీవుడ్ ప్రపంచంలో నటించి గొప్ప పేరు తెచ్చుకున్న షామా సికందర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. షామా సికందర్ తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో ప్రతిరోజూ తన అభిమానుల కోసం బోల్డ్ ఫోటోలు మరియు వీడియోలను పంచుకుంటున్నారు. వీటన్నింటి మధ్య, షామా సికందర్ తన కొత్త ఫోటోలను పంచుకున్నారు. షామా సికందర్ యొక్క ఈ కొత్త చిత్రాలు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో పాపులర్ అయ్యాయి.తాజాగా షామా సికందర్ ఈ చిత్రాన్ని పంచుకున్నారు. ఈ చిత్రంలో, నటి మోనోకిని ధరించి కనిపించింది.ఈ చిత్రంలో, షామా సికందర్ మోనోకినిలో గ్లామర్‌గా కనిపించారు. షామా సికందర్ యొక్క ఈ చిత్రాన్ని ఆమె అభిమానులు విస్తృతంగా షేర్ చేస్తున్నారు.షామా సికందర్ యొక్క ఈ బోల్డ్ మరియు గ్లామరస్ లుక్‌ను అభిమానులు ఇష్టపడుతున్నారు.ఇంతకుముందు షామా తన ఇన్‌స్టాగ్రామ్‌లో బోల్డ్ చిత్రాలను కూడా పోస్ట్ చేశారు.



# లెహంగాలో ఈషా గుప్తా

బాలీవుడ్ నటి ఈషా గుప్తా తన స్టైలిష్ మరియు గ్లామరస్ లుక్ కోసం హెడ్‌లైన్స్‌లో నిలిచిపోయింది. మరోసారి ఈషా గుప్తా గ్లామరస్ లుక్ ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోంది. ఈషా గుప్తా తాజా లుక్ గురించి మాట్లాడుతూ, ఈషా గుప్తా స్టైలిష్ దుస్తులలో విధ్వంసం సృష్టిస్తోంది. ఈషా గుప్తా స్లిట్ డ్రెస్‌లో తన ఫిగర్‌ని ప్రదర్శిస్తోంది.ఈషా గుప్తా యొక్క తాజా లుక్ గురించి మాట్లాడుతూ, నటి లోతైన మెడ మరియు చీలిక దుస్తులలో తన బొమ్మను ప్రదర్శిస్తుంది. అతని ఈ అవతార్ ఇంటర్నెట్‌లో చాలా లైక్ చేయబడుతోంది. ఈషా గుప్తా ముదురు గోధుమ రంగు లిప్‌స్టిక్ వేసుకుంది. ఈషా గుప్తా ఓపెన్ హెయిర్ మరియు స్మోకీ కాపర్ ఐ మేకప్‌లో చాలా గ్లామరస్‌గా కనిపిస్తోంది.ఈషా గుప్తా తెల్లటి లెహంగాతో లైట్ మేకప్ వేసుకుంది. నటి ఓపెన్ హెయిర్ మరియు లైట్ షేడ్ లిప్‌స్టిక్‌లో చాలా గ్లామరస్‌గా కనిపిస్తుంది. నటి లెహంగాతో కూడిన తేలికపాటి ఆకుపచ్చ చోకర్ సెట్‌ను ధరించింది.



## రాయదుర్గం-శంషాబాద్
# మెట్రో ప్రాజెక్టు నిలిపివేత

హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు మార్గాల విస్తరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుపై ఆరా తీశారు. ఓఆర్‌ఆర్ వెంట జీవో 111 ప్రాంతంలో మెట్రో ఎలైన్‌మెంట్‌ను రూపొందించడంపై అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే అక్కడ ఓఆర్‌ఆర్ ఉన్న నేపథ్యంలో.. రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు నిర్మించాల్సిన మెట్రో టెండర్లను నిలిపివేయాలని ఆదేశించారు. దానికి ప్రత్యామ్నాయంగా ఎంజీబీఎస్-ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, ఎయిర్‌పోర్టు మీదుగా ఎలైన్‌మెంట్ రూపొందించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా రెండు మార్గాలను పరిశీలించాలని సూచించారు. చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, విమానాశ్రయం పీ7 రోడ్డు ఒక మార్గం కాగా.. చాంద్రాయణగుట్ట, బార్కాస్, పహాడీషరీఫ్, శ్రీశైలం రోడ్డు మార్గాన్నీ అధ్యయనం చేయాలని, ఇందులో ఏదీ తక్కువ ఖర్చు అయితే దానికి ప్రాధాన్యం ఇచ్చి కొత్త ఎలైన్‌మెంట్ రూపొందించాలని సూచించారు. తద్వారా తూర్పు, మధ్య, పాత నగరంలోని అధిక జనాభాకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. రాయదుర్గం నుంచి విమానాశ్రయం వరకు మెట్రో లైను నిర్మాణం కోసం గత భారాస ప్రభుత్వం ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేసి.. టెండర్లను కూడా పిలిచింది. వాటిని ఆమోదించే దశలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో వాటి ఖరారుపై నిర్ణయం తీసుకోలేదు. ఈ లైనుకు దాదాపు రూ.6,250 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ మార్గానికి హెచ్ఎండీఏ నుంచి రూ.600 కోట్లు ఇస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం కొలువుదీరగా.. ఈ లైన్ విషయంలో సర్కారు వైఖరిలో మార్పు వచ్చింది. శంషాబాద్ నుంచి విమానాశ్రయానికి ఓఆర్‌ఆర్ ఉండటంతో ఈ కారిడార్‌లో మెట్రో లైను అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ భావిస్తున్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం మెట్రోపై ఆయన సమీక్ష చేశారు.




**పాతబస్తీ మెట్రో పూర్తి చేయకపోవడంపై అసంతృప్తి**

మెట్రో మొదటి దశలో ఒప్పందం మేరకు పాతబస్తీలోని ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల మార్గాన్ని ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ పూర్తి చేయకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేసి పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం మెట్రోపైనా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలన్నారు. మూసీ కారిడార్‌లో నాగోలు నుంచి గండిపేట వరకు ఎంజీబీఎస్‌ను కలుపుతూ ఈస్ట్, వెస్ట్ రోడ్డు కమ్ మెట్రో రైలును మాస్టర్ ప్లాన్‌లో చేర్చాలని సూచించారు.

**హైదరాబాద్‌కు దూరంగా ఫార్మాసిటీ**

కందుకూరు సమీపంలోని పార్మా సిటీ కోసం సేకరించిన భూమిలో పర్యావరణహిత మెగా టౌన్‌షిప్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. కాలుష్యకారకమైన ఫార్మా సిటీ హైదరాబాద్‌కు సమీపంలో ఉండకూడదని, నగరానికి దూరంగా ఏర్పాటు చేయాలని చెప్పారు. విమానాశ్రయం నుంచి శ్రీశైలం రోడ్డులోని తుక్కుగూడ మీదుగా కందుకూరు మెగా సిటీకి మెట్రోను అనుసంధానించాలన్నారు. నగరాన్ని అన్ని దిశల్లో అభివృద్ధి చేయాలన్నారు. భౌగోళిక పరిమితులు లేని ప్రపంచ నగరంగా ఎదిగేందుకు హైదరాబాద్‌కు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. తెలంగాణలో ఇప్పటికే 40 శాతం పట్టణీకరణ ఉందని, మరింత వేగవంతంగా పట్టణీకరణ చెందుతున్న దృష్ట్యా ఓఆర్‌ఆర్ చుట్టూ శాటిలైట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. భవిష్యత్తులో ఇక్కడ 2-3 కోట్ల జనాభా నివసించేందుకు అనుగుణంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలన్నారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, సీఎంవో కార్యదర్శి వి.శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.




## అడివి శేష్ నెక్స్ట్ మూవీ టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ కి డేట్ ఫిక్స్!

టాలీవుడ్ టాలెంటెడ్ నటుడు అడివి శేషు ఇటీవల గూఢచారి 2 చిత్రం షూటింగ్ ను స్టార్ట్ చేశారు. ఈ చిత్రం సూపర్ హిట్ అయిన గూఢచారి కి సీక్వెల్ గా తెరకెక్కుతోంది. ఈ చిత్రం కోసం ఆడియెన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. అయితే మరొక ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ ను కూడా అనౌన్స్ చేసి హాట్ టాపిక్ గా మారిపోయారు. హీరో అడివి శేష్, స్టార్ హీరోయిన్ అయిన శృతి హాసన్ తో కలిసి ఒక సినిమా చేస్తున్నారు. ఇది ఒక భారీ పాన్ ఇండియా మూవీ. శనేయిల్ డియో ఈ చిత్రం తో దర్శకుడు గా పరిచయం అవుతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రానికి నిర్మాత గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం కి సంబంధించిన టైటిల్ ను మరియు ఫస్ట్ లుక్ ను డిసెంబర్ 18 న రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఒక ఇంట్రెస్టింగ్ పోస్టర్ ను విడుదల చేసారు. ఇది విశేషం గా ఆకట్టుకుంటుంది.

## ఆధార్ సర్వీసులకు కోసం ఎక్కువ వసూలు చేస్తే సస్పెండే..
# వారికి రూ.50వేల జరిమానా

ఆధార్ సర్వీసుల కోసం ఎవరైనా ఆపరేటర్లు ఎక్కువ ఫీజులు వసూలు చేస్తే అతన్ని సస్పెండ్ చేయడంతో పాటు అతన్ని నియమించిన రిజిస్ట్రార్‌కు రూ.50వేల జరిమానా విధించనున్నట్లు ఐటీ మంత్రిత్వశాఖ పార్లమెంట్‌కు తెలిపింది. బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ వివరాల అప్‌డేట్‌తో సహా ఆధార్ సర్వీసుకు సంబంధించి అదనంగా ఛార్జీలు వసూలు చేయొద్దని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఆధార్ ఆపరేటర్లందరినీ కోరిందని ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ సహాయ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఎవరైనా అదనంగా ఫీజులు వసూలు చేస్తే ఉడాయ్‌కి ఈ-మెయిల్ లేదంటే టోల్‌ఫ్రీ నంబర్ 1947 కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఈ ఏడాది నవంబర్ వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్‌పై కేంద్ర ప్రభుత్వానికి 19.45 లక్షల ఫిర్యాదులు అందాయని.. వీటిలో దాదాపు 19.60 లక్షల ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. తపాలా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురానున్న కేంద్రం పేర్కొన్నది. ఈ మేరకు బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ.. బిల్లులోని నిబంధనలను ప్రైవేట్ కొరియర్ కంపెనీలకు ప్రయోజనం చేకూరుస్తాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అయితే, పోస్టాఫీసుల పరిధిని విస్తరించేందుకు సమూల మార్పులు అవసరమని కేంద్రం పేర్కొంది. అవసాన దశలో ఉన్న పోస్టల్ వ్యవస్థకు మోదీ ప్రభుత్వం కొత్త జీవం పోసిందని బీజేపీ ఎంపీ తపిర్ గావో పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కంటే ముందు దేశంలో పోస్టాఫీసులు ఒకదాని తర్వాత ఒకటి మూతపడేవన్నారు. తొమ్మిదేళ్లలో 6వేలకుపైగా శాఖలు ప్రారంభించినట్లు చెప్పారు.




## లేటెస్ట్..మరోసారి రానా, తేజ నుంచి క్రేజీ ప్రాజెక్ట్.!

మన టాలీవుడ్ లో ఉన్న వెరీ టాలెంటెడ్ హీరోస్ లో తన నటనతో ఎప్పటికప్పుడు ఆశ్చర్యపరిచే విలక్షణ నటుడు రానా దగ్గుబాటి కూడా ఒకడు. మరి రానా హీరోగా ఇప్పుడు పలు భారీ చిత్రాలు చేస్తుండగా లేటెస్ట్ గా ఓ క్రేజీ ప్రాజెక్ట్ ని అయితే తాను అనౌన్స్ చేసాడు. ప్రముఖ దర్శకుడు తేజతో అయితే తాను ఆల్రెడీ ఓ సాలిడ్ హిట్ చిత్రం "నేనే రాజు నేనే మంత్రి" చిత్రం చేసిన సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రం అనంతరం వీరి కాంబినేషన్ నుంచి రెండో సినిమా కోసం కూడా చాలా మంది ఆశించారు. ఇక ఫైనల్ గా దీనిపై ఈ రోజు ఓ సాలిడ్ అప్డేట్ అయితే వచ్చేసింది. తమ కాంబినేషన్ లో రెండో సినిమాగా "రాక్షస రాజా" అనే సినిమాని అయితే రానా బర్త్ డే కానుకగా అనౌన్స్ చేశారు. మరి దీని నుంచి రానాపై ఇంట్రెస్టింగ్ ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ చేయడం వైరల్ గా మారింది.






## నెలసరి వైకల్యం కాదు: పిరియడ్ లీవ్‌పై
# స్మృతి ఇరానీ వ్యాఖ్య

మహిళా ఉద్యోగులకు నెలసరి సమయంలో సెలవులు ఇచ్చే ప్రతిపాదనను కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి స్మృతి ఇరానీ వ్యతిరేకించారు. రాజ్యసభలో ఎంపీ మనోజ్ కుమార్ ఝా అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. 'మహిళకు నెలసరి అనేది వైకల్యం కాదు. ఆమె జీవితంలో అదొక సహజ ప్రక్రియ. ఈ నెలసరి సెలవులు .. పని ప్రదేశంలో వివక్షకు దారితీయొచ్చు' అని ఇరానీ వెల్లడించారు. అలాగే నెలసరి సమయంలో పాటించాల్సిన శుభ్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా కేంద్ర ఆరోగ్య శాఖ ముసాయిదా తీర్మానాన్ని రూపొందించిందని ప్రకటించారు. దీని ద్వారా మహిళల్లో చైతన్యం కలిగించడమే లక్ష్యమని తెలిపారు. అలాగే 10-19 ఏళ్ల అమ్మాయిల్లో వివిధ కార్యక్రమాల ద్వారా నెలసరి శుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఇప్పటికే అమల్లో ఉన్న 'ప్రమోషన్ ఆఫ్ మెన్స్ట్రువల్ హైజీన్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఎం) స్కీమ్' గురించి ప్రస్తావించారు. ఈ సెలవు అంశంపై సోమవారం పార్లమెంట్‌లో ఒక నివేదిక ప్రవేశ పెట్టారు. దానిని ఆరోగ్యశాఖ సమీక్షించాల్సి ఉంది. ఈ క్రమంలోనే మంత్రి స్పందించారు. కొద్దిరోజుల క్రితం కూడా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అడిగిన ప్రశ్నకు స్మృతి ఇరానీ సమాధానం ఇస్తూ.. 'అన్ని సంస్థల్లో వేతనంతో కూడిన నెలసరి సెలవును తప్పనిసరిగా ప్రకటించాలనే ప్రతిపాదనలు ప్రస్తుతానికి ప్రభుత్వ పరిశీలనలో లేవు. రుతుస్రావం అనేది స్త్రీలలో ఒక శారీరక ప్రక్రియ. కొద్దిమంది మహిళలు మాత్రమే డిస్మెనోరియా వంటి సమస్యలతో బాధపడుతుంటారు. చాలా వరకు ఇలాంటి సమస్యలను మందుల ద్వారా నయంచేసుకోవచ్చు' అని వెల్లడించారు.